క్లుప్తంగా

ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ


ప్రతిష్ఠించిన వాల్మీకి మహర్షి విగ్రహం

పగిడ్యాల: పడమర ప్రాతకోట గ్రామంలో సోమవారం వాల్మీకి యూత్ ఆధ్వర్యంలో వీరముసలాయ కట్ట ఆవరణలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పురోహితులు బాలకృష్ణశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని జరిపించారు. అనంతరం బోయ కులస్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

బీఎల్‌ఓలు అప్రమత్తంగా ఉండాలి


బీఎల్‌ఓలకు సలహాలు,సూచనలు ఇస్తున్న తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్

జూపాడుబంగ్లా: ఓటర్ల చేర్పులు, మార్పులపై బూత్‌లెవెల్ ఆఫీసర్లు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లో ఎవరైనా ఓటర్ల చేర్పులు, మార్పులకోసం దరఖాస్తులు ఇచ్చినట్లయితే వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అవసరమైతే కుటుంబ సభ్యులు లేక వారి బంధువులతో డిక్లరేషన్ తీసుకొని ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులుచేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు చంద్రశేఖర్, నాగన్న, ఆర్ఐ శ్రీరంగారెడ్డి పాల్గొన్నారు.

కైపా శ్రీధర్‌రెడ్డికి నివాళి


కైపా శ్రీధర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, డాక్టర్ దారా సుధీర్

మిడుతూరు: ఇటీవల మృతిచెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కైపా శ్రీధర్‌రెడ్డి చిత్రపటానికి ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. పీరుసాహెబ్ పేట గ్రామానికి చేరుకున్న వారు శ్రీధర్‌రెడ్డి పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ తరుపున అండగా ఉంటామని శ్రీధర్‌రెడ్డి కుటుంబానికి ఏపీ శాప్ చైర్మన్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ పర్వత యుగంధర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ నాగతులసిరెడ్డి, గ్రామ నాయకులు జగదీశ్వర రెడ్డి, గోపు చంద్రశేఖర్ రెడ్డిలు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

కొత్తపల్లి: సారా విక్రయిస్తుండ ఓ మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. మండలంలోని ఎర్రమఠం గ్రామంలో రవణమ్మ అనే మహిళ నాటుసారా విక్రయిస్తుండగా.. సమాచారం మేరకు ఈనెల 15న దాడి చేయగా 10 లీటర్ల నాటుసారా లభించిందని చెప్పారు. అయితే నిందితురాలు అక్కడి నుంచి పరారయ్యిందని చెప్పారు. అప్పటి నుంచి కర్నూలులో ఉంటూ సోమవారం స్వ గ్రామమైన ఎర్రమఠానికి వస్తున్నప్పుడు ఆత్మకూరు బస్టాండ్‌లో ఉందని సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశామని చెప్పారు. సోమవారం ఆమెను నంద్యాల కోర్టులో హాజరు పరుచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు వెల్లడించారు.

ఇంటి పట్టాలపై అభ్యంతరాలు తెలపండి

నందికొట్కూరు రూరల్ : పట్టణంలోని బైరెడ్డి నగర్ కాలనీలో సర్వే నంబర్ 589, 590, 595లో తాత్కాలిక నివాసం ఉంటున్న వంద కుటుంబాలకు ఇంటి పట్టాలు మంజూరు చేసినా, నేటికీ ఇంటి నిర్మాణం చేపట్టకపోవడం పట్ల ఈ నెల 26వ తేదీలోపు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాత పూర్వకంగా లబ్ధిదారులు తమ అభ్యంతరాలను తెలియజేయాలని మండల తహసీల్దార్ దామోదరరెడ్డి తెలిపారు. నిర్ణీత సమయంలోగా అభ్యంతరాలు తెలియజేయకపోతే రికార్డులను గుర్తించి అనర్హులుగా గుర్తించి మేరకు లబ్ధిదారులకు కేటాయించిన ఇంటి స్థలాలను రద్దు చేస్తామన్నారు.

ఆధార్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పగిడ్యాల: మండలంలోని లక్ష్మాపురం-1, 2, 3, పగిడ్యాల 1, 2, 3, నెహ్రూనగర్ 1, పి.ముచ్చుమర్రి గ్రామ సచివాలయాల పరిధిలో ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కవిరాజు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నవారు ఆయా గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంప్‌లను సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. మరిన్ని సేవల కోసం వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్ అశోక్, చంద్రకుమార్‌లను 6301480498, 9494731486లను సంప్రదించాలని సూచించారు.

సంక్షేమ పథకాలకు బ్రాండ్ అంబాసిడర్లు

- వలంటీర్ల సేవలకు సెల్యూట్
- ఏపీ శాసనసభ ఎథిక్స్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- మహానంది, బండిఆత్మకూరులో 'వలంటీర్లకు వందనం'

మహానంది: సంక్షేమ పథకాల వలంటీర్ల బ్రాండ్ అంబాసిడర్లని, క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ.. ఉత్తమ పనితీరును కనబరుస్తున్న వారే మా బలం.. బలగం అని ఏపీ అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కొనియాడారు. మహానందిలోని పోచా బ్రహ్మానందారెడ్డి డార్మెటరీ భవనం, బండిఆత్మకూరు మండలం పార్నపల్లెలోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహానంది మండలంలో 182 మంది, బండిఆత్మకూరు మండలంలో 244 మంది వలంటీర్లను సన్మానించారు. సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలు అందుకున్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తున్న వలంటీర్ల సేవలు మరువలేమని, ఏమీ ఆశించకుండా లబ్ధిదారులకు పథకాలు అందిస్తున్న మా కుటుంబ సభ్యులు అంటూ కొనియాడారు. కోవిడ్ మహమ్మారి వేలాది మందిని పొట్టన పెట్టుకున్న విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి ప్రజలకు సేవలు అందించిన జగనన్న సైన్యానికి సెల్యూట్ అని చెప్పారు.

బూతుల రాజశేఖర్‌రెడ్డికి బూత్‌ల్లో బుద్ధి చెప్పాలి

నిత్యం సమావేశాల్లో బూతులు మాట్లాడే మాజీ ఎమ్మెల్యే బూతుల రాజశేఖర్‌రెడ్డికి ఓటర్లు పోలింగ్ బూత్‌ల్లో సమాధానం చెప్పాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తనయుడు, యువనేత శిల్పా కార్తీక్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహానందిలో వారు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే తాట తీస్తానంటూ వైఎస్సార్‌సీపీ నేతలను మాజీ ఎమ్మెల్యే బుడ్డా హెచ్చరిస్తున్నారని, అయితే మా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ నాగభూపాల్‌రెడ్డి, సర్పంచు లక్ష్మీరెడ్డి, ఎంపీటీసీలు వెంకటేశ్వర్లు, మునగాల మల్లికార్జునరెడ్డి, సలహా మండలి చైర్మన్ శరభారెడ్డి, బూత్ కమిటీల కన్వీనర్ కుంచపు శ్రీనివాసులు, నాయకులు కొండా మధుసూధన్‌రెడ్డి, వీరారెడ్డి, రఘురామిరెడ్డి, చైర్మన్ పగడాల నాగరాజు, మాజీ ధర్మకర్త గంగిసెట్టి మల్లికార్జునరావు, ఎంపీడీఓ శివనాగజ్యోతి, అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆడపడుచులకు ''ఆసరా''.

మహిళలకు పెద్దపీట వేస్తున్న జగనన్న ప్రభుత్వం అవకాశం వచ్చినప్పుడల్లా వారికి అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మహానంది మండలంలోని 666 సంఘాలకు రూ. 4.72కోట్లు, బండిఆత్మకూరు మండలంలో 773 సంఘాలకు రూ. 4.92కోట్ల వైఎస్సార్ ఆసరా నాలుగవ విడత చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బండిఆత్మకూరు ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, పార్నపల్లె సర్పంచ్ షేక్ షబ్బీర్ అహమ్మద్, సర్పంచ్ బోధనం భాస్కర రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ జాయింట్ సెక్రటరీ విక్రమసింహానాయక్, జేసీఎస్ ఇన్‌చార్జ్ ముడిమెల పుల్లారెడ్డి, సొసైటీ చైర్మన్ శివలింగం పాల్గొన్నారు.

పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా

పేదలకు ఎల్లప్పుడూ తన వంతుగా అండగా ఉంటానని ఏపీ శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. బండిఆత్మకూరు మండలం పార్నపల్లె గ్రామానికి చెందిన చిన్నపుల్లయ్య అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఆయన సోమవారం ఆర్థిక సహాయం అందించారు. అలాగే బండిఆత్మకూరుకు చెందిన మహమ్మద్ అలీ ఆర్థిక ఇబ్బందులు తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్థిక సాయం చేశారు.



మహానంది మండల వలంటీర్లతో ఎమెల్యే శిల్పా, కార్తీక్‌రెడ్డి, భువనేశ్వరరెడ్డి, పార్నపల్లెలో పొదుపు మహిళలకు ఆసరా చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే

ప్రజలకు ప్రభుత్వానికి వారధులు వలంటీర్లు

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలకు మధ్యవారధులు గ్రామవలంటీర్లు అని, గ్రామ వలంటీర్ల సేవలు ఎనలేనివని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ జవహర్‌బాబు అధ్యతన వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు వలంటీర్ల సేవలను కొనియాడారు. అనంతరం జెడ్పీటీసీ మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఇంటివద్దకే సంక్షేమ పథకాలు, సచివాలయ సేవలు, పింఛన్ అందజేస్తున్నారన్నారు. కరోనా సమయంలో వారు అందించిన సేవలు చిరస్థాయిగా గుర్తుంటాయన్నారు. మండలంలో ఐదుగురికి సేవరత్న, 141 మందికి సేవమిత్ర అవార్డులు వచ్చాయని, వారికి రూ.24,30,000 ప్రభుత్వం నగదు రూపంలో పురస్కారం అందజేసిందన్నారు. అనంతరం వలంటీర్లకు ప్రశాంసా పత్రాలు, మెడల్స్‌ను అందించి, దుశ్శాలువలతో వారిని సన్మానించారు.


మాట్లాడుతున్న నందికొట్కూరు ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి

మోగా చెక్కును కూడా గ్రామవలంటీర్లకు అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, కార్యాలయ సిబ్బంది, కో-ఆప్టేడ్ మెంబర్ మహమ్మద్ గౌస్, వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు మరవలేనివి

నందికొట్కూరు రూరల్ : ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ గ్రామాల్లో వలంటీర్లు అందిస్తున్న సేవలు మరవలేనివని ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రామాన్ని నిర్వహించారు.


కొత్తపల్లిలో సేవరత్న అవార్డు గ్రహీతలతో జెడ్పీటీసీ, ఎంపీడీఓ, అధికారులు

వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడంలో వలంటీర్లు కీలక పాత్ర వహిస్తున్నారన్నారు. ఈ ఏడాది మండలంలో సేవా వజ్ర అవార్డుకు ఒకరు, సేవారత్న అవార్డుకు ఐదుగురు, సేవామిత్రలుగా 186 మంది ఎంపికైనట్లు వారు తెలిపారు. అనంతరం అవార్డులకు ఎంపికైన వలంటీర్లకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సంజన్న, జెడ్పీటీసీ కరిమున్నిసా, మండలాధ్యక్షుడు రవియాదవ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ పబ్బతి రవి, సర్పంచ్‌లు జనార్దన్‌గౌడ్, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం


భక్తజనసందోహం మధ్య రథోత్సవం

- ఘనంగా బరకసంజీవరాయ ఆలయ వార్షికోత్సవం
- భక్తజనసందోహం మధ్య రథోత్సవం

మిడుతూరు: రోళ్లపాడు అభయరణ్యంలో వెలసిన శ్రీ బరక సంజీవరాయ స్వామి ఆలయ 13వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషే కం, కలశ పూజ, మన్యసూక్తహోమం, తదితర విశేష పూజాధిత కార్యక్రమాలను పండితులు నరహరి శర్మ, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చేపట్టారు. అనంతరం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది.

రమణీయం .. రథోత్సవం

స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి మేళతాళాలతో రథం వద్దకు తీసుకువచ్చారు. అనంతరం రథంపై కొలువుంచి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తజనుల జయ జయ ధ్వానాల మధ్య రథోత్సవం సాగింది.

శ్రీ బరకసంజీవరాయ స్వామికి ప్రత్యేక పూజలు

బరక సంజీవరాయ స్వామికి ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సుధీర్, సర్పంచ్ పేరెడ్డి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి, ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ, పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ చైర్మన్ నాగతులసిరెడ్డి, పట్టణ మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ తువ్వా శివరామకృష్ణా రెడ్డి, మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సిద్ధార్థరెడ్డి, డాక్టర్ దారా సుధీర్


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న సిద్ధార్థరెడ్డి

రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

రాష్ట్ర స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలను ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్‌లు ప్రారంభించారు. ఆలయ చైర్మన్ పేరెడ్డి మురళీ మోహన్ రెడ్డి, గ్రామపెద్దలు పేరెడ్డి రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నబిరసూల్, మండల ఏసీఎస్ కన్వీనర్ రవికుమార్, కల్యాణ మండపం చైర్మన్ పాలగ్గారి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కులగణనలో ఐదో స్థానం

మహానంది: కులగణన సర్వేలో మహానంది మండలం నంద్యాల జిల్లాలో ఐదోస్థానంలో నిలిచిందని మహానంది ఎంపీడీఓ శివనాగజ్యోతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ మహానంది మండలంలోని 13 గ్రామ పంచాయతీలు, మజరా గ్రామాల్లో 94శాతం సర్వే పూర్తయిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, సిబ్బందిని ఎంపీడీఓ శివనాగజ్యోతి అభినందించారు.

ఆయిల్ పామ్ సాగు లాభదాయకం


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ పవన్ కుమార్

వెలుగోడు: ఆయిల్ పామ్ సాగుతో రైతులకు లాభాలు వస్తాయని ఏఓ పవన్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏఓ పవన్ కుమార్ అధ్యక్షతన పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో మండల రైతులకు ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయిల్ పామ్ సాగులో యాజమాన్యం పద్ధతులు, మెలకువలు గురించి రైతులకు తెలిపారు. మండల రైతులందరూ పీఎం కిసాన్ లబ్ధి కొరకు బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ కార్డు కచితంగా లింక్ చేసుకోవాలని సూచించారు. కోరమండల్ ప్రతినిధి ప్రవీణ్ కుమార్ నానో డీఏపీ ఆవశ్యకత, ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఫీల్డ్ అసిస్టెంట్లు మౌనిక , సూర్య తేజ, రైతులు, ఆర్.బి.కె ఇన్‌చార్జ్ వెంకట శివ రామకష్ణ, అఫ్సర్, లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివాజీ శోభాయాత్ర

శ్రీశైలం : ఛత్రపతి శివాజీ 394వ జయంతి సందర్భంగా శ్రీశైల మహాక్షేత్రంలో సోమవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన పురవీధులోని గంగాధర మండపం వద్ద ప్రారంభమైన శోభయాత్ర అంకాలమ్మ గుడి, నందిమండపం, స్టాఫ్ క్వార్టర్స్, మల్లికార్జున సదన్, బయలు వీరభద్రస్వామి ఆలయం, పాడుపు భవన్ మీదుగా యాదవసత్రం, ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీ, రుద్రాక్ష మఠం, వీభూది మఠం మీదుగా చివరకు శివాజీ స్ఫూర్తి కేంద్రం చేరింది. అక్కడ ఆర్ఎస్ఎస్ ప్రాంత సహబౌద్దిక్ ప్రముఖ్‌తో సమావేశం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శివాజీ జీవిత చరిత్ర-హిందు మత పునఃవైభవంపై వ్యాసరచన, వకృత్వపు పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో భజరంగ్ దళ్, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, బీజేపీ, వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న హిందువులు

మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ

పాములపాడు: ధర్మ పరిరక్షకుడు, మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ అని ఆరె మరాఠా సంఘం నాయకుడు పెద్ద వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. నాగభూషణంరావు, రామచంద్రారవు, వాసుదేవరావు, రాఘవేంద్రరావు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అబ్దుల్లాపురంలో ఆర్‌బీకే ప్రారంభోత్సవం

వెలుగోడు: అబ్దుల్లాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనాన్ని మంగళవారం శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు ఏఓ పవన్ కుమార్ తెలిపారు. సోమవారం ఆర్‌బీకే కేంద్రం ప్రారంభోత్సవ పనులు, ఏర్పాట్లను ఏఓ పరిశీలించారు. రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవంలో రైతులు, గ్రామస్తులు పాల్గొని విజయవంతం చేయాలని, ఆర్‌బీకే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామకృష్ణ, వ్యవసాయ విస్తరణ సిబ్బంది అర్పుత్, రామలక్ష్మి పాల్గొన్నారు.

స్పందనను సద్వినియోగం చేసుకోండి

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో సైతం సమస్యలు లేకుండా చేసేందుకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తోందని దీనిని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ తిరుపతయ్య సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎటువంటి సమస్యనైనా రూపుమాపేందుకు ప్రభుత్వం స్పందన కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. అందులో భాగంగానే మండలంలోని ఆయా గ్రామాల నుంచి 4 దరఖాస్తులు కుల ధ్రువీకరణ కోసం, 2 దరఖాస్తులు ఆదాయ ధ్రువీకరణ కోసం వచ్చాయని తెలిపారు. వాటని త్వరలో పరిష్కారం చేస్తామని చెప్పారు.

ట్యాబ్‌లపై అవగాహన


మాట్లాడుతున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): స్థానిక డిప్యూటీ ఈఓ కార్యాలయంలో సహిత విద్య ఉపాధ్యాయులు, ఐఈడీ ఎస్ఎస్‌స్కూల్ అసిస్టెంట్లు, ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ట్యాబ్‌లపై డీఈఓ సుధాకర్ రెడ్డి, అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఏపీ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన 233 ట్యాబ్‌లను దివ్యాంగ విద్యార్థులు, సహిత విద్య, ప్రత్యేక ఉపాధ్యాయులకు అందజేశామన్నారు. ట్యాబ్‌లను ఎలా ఉపయోగించాలి, ప్రత్యేక అవసరాలకు గల పిల్లలకు ఎలా బోధన చేయాలి అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. ట్యాబ్‌లో 33 రకాల యాప్‌లు ఉన్నాయని, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు వాటి ద్వారా ఎలా బోధన చేయాలో వివరించారు. స్టేట్ రిసోర్స్ పర్సన్ సునిల్‌కుమార్, లక్ష్మీనాయుడు, రాష్ట్ర పరిశీలకులు నరసింహులు హాజరయ్యారు. సహిత విద్య కో ఆర్డినేటర్ రఘురామిరెడ్డి, శ్రీనివాసులు, ఎంఈఓ బ్రహ్మం పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- దామగట్లలో సచివాలయం, హెల్త్‌క్లినిక్, అభివృద్ధి పనుల ప్రారంభం

నందికొట్కూరు రూరల్ : ముఖ్యమంత్రి జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని దామగట్ల గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాధవరం సుశీలమ్మ, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు మాధవరం రత్నం ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థ దేశంలో ఎక్కడాలేదన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే పాలనను తీసుకువచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందఅన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందించి ప్రజలకు అండగా నిలిచారని చెప్పారు.

అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటా

అధిష్టానం నిర్ణయానికి తాను ఎప్పుడూ కట్టుబడి ఉంటానని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా కొత్త వారిని నియమించడం పట్ల ఆయన స్పందించారు. తనకు ఎమ్మెల్యే టికెట్ లేకపోవడం పట్ల ఎలాంటి బాధలేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయానికి తాను విలువనిస్తానని చెప్పారు. నియోజకవర్గ ప్రజలకు తాను రుణపడి ఉంటానన్నారు. అనంతరం ఆయన సర్పంచ్ సుశీలమ్మతో కలిసి రూ.43.60 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయాన్ని, రూ.17లక్షలతో నిర్మించిన హెల్త్ క్లినిక్‌ను, గ్రామంలోని రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, పీఆర్ ఏఈ ప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్లు ధర్మారెడ్డి, మొల్లా జాకీర్‌హుసేన్, వైఎస్సార్ సీపీ నాయకులు హరిసర్వోత్తమరెడ్డి, జాన్, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.


దామగట్లలో నూతన సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

బుక్ కీపర్‌పై చర్యలు తీసుకోవాలి

నందికొట్కూరు: పొదుపు గ్రూపు సంఘాలకు చెందిన మహిళలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా స్త్రీనిధి నుంచి రూ.లక్షలు విత్‌డ్రా చేసిన బుక్ కీపర్‌పై చర్యలు తీసుకోవాలని అమృత, అరుంధతి, నేతాజీ, లత, మేఘన పొదుపు గ్రూపులతో పాటు మరో నాలుగు గ్రూపుల సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని వైకేపీ కార్యాలయం ఎదుట పొదుపు సంఘాల మహిళలు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ 2021 నుంచి 2023 వరకు పొదుపు మహిళలకు తెలియకుండా స్త్రీనిధి పైసలను విత్‌డ్రా చేసుకొని, వాడుకొని ఇంత వరకూ చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైకేపీ అధికారులు మూడు నెలలు సమయం ఇచ్చినా నేటికీ చెల్లించలేదని మండిపడ్డారు. రూ.18.45 లక్షలకు గాను రూ.7.65 చెల్లించారని మిగతా రూ.10.80 లక్షలు రావాల్సిందని వాపోయారు. బుక్ కీపర్ విజయనిర్మల, భర్త పుల్లంరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

రాళ్లతో దాడి.. కేసు నమోదు

మహానంది: చికెన్ సెంటర్‌లోని వ్యర్థ పదార్థాలు ఇంటి పక్కన వేస్తున్నారంటూ అడిగినందుకు రాళ్లతో దాడి చేసిన ఘటన తమ్మడపల్లెలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు తమ్మడపల్లె గ్రామానికి చెందిన చికెన్ వెంకటేశ్వర్లు వ్యర్థపదార్థాలను తన ఇంటి సమీపంలో వేస్తున్నారని అదే గ్రామానికి చెందిన మంగలి వెంకటేశ్వర్లు ప్రశ్నించడంతో మాటామాటా పెరిగింది. దీంతో చికెన్ వెంకటేశ్వర్లు దంపతులు రాళ్లతో మంగలి వెంకటేశ్వర్లుపై దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన ఫిర్యాదు మేరకు చికెన్ వెంకటేశ్వర్లు దంపతులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

దోమతెర అంటుకొని వ్యక్తికి గాయాలు

జూపాడుబంగ్లా: రమణయ్య అనే వ్యక్తి నిద్రిస్తుండగా షార్ట్‌సర్క్యూట్ సంభవించటంతో దోమతెర, మంచానికి నిప్పంటుకోవడంతో తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం తెల్లవారుజామున జూపాడుబంగ్లాలో చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన రమణయ్య ఇంటికి సమీపంలో ఉన్న పశువుల రేకుల షెడ్డులో దోమతెర పెట్టుకొని మంచంపై నిద్రించసాగాడు. అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో అకస్మాత్తుగా ఫ్యాన్‌కు షాట్‌సర్క్యూట్ సంభవించటంతో నిప్పురవ్వలు దోమతెరపై పడ్డాయి. అవికాస్త రగులుకొని మంటలు వ్యాపించటంతో మంచంపై గాఢ నిద్రలో ఉన్న రమణయ్యకు అంటుకోవటంతో కేకలు వేశాడు. పక్క గదిలో నిద్రిస్తున్న అతని మనుమడు అరుపులు విని పరుగెత్తుకొని వచ్చి దుప్పటితో మంటలను ఆర్పివేసి అతన్ని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నేడు వలంటీర్లకు సత్కారం

జూపాడుబంగ్లా/పగిడ్యాల/పాములపాడు: ఉత్తమ సేవలందించిన గ్రామ వలంటీర్లకు మంగళవారం ఆయా మండల కేంద్రాల్లో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహిస్తున్నట్లు జూపాడుబంగ్లా, పగిడ్యాల, పాములపాడు మండలాల ఎంపీడీఓలు సూర్జహాన్, కవిరాజు, సరస్వతి తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, ఎంపీపీలు హాజరుకావాలని కోరారు.

రేపు నందికొట్కూరులో

నందికొట్కూరు: వలంటీర్లకు సన్మాన కార్యక్రమం బుధవారం నిర్వహిస్తునట్లు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు నంద్యాల రోడ్డులోని కేవీఆర్ గార్డెన్‌లో 14వ సచివాలయానికి సంబంధించిన వలంటీర్లకు సన్మాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే చదవాలి


మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్‌జబ్బార్

ఆత్మకూరు : విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యాభ్యాసం కొనసాగించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ అబ్దుల్‌జబ్బార్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డిగ్రీ కళాశాలలో కోర్సులు, సౌకర్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకునేందుకు ప్రతి విద్యార్థి తప్పని సరిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలన్నారు. ఇప్పటి నుంచే అడ్మిషన్లు కూడా స్వీకరిస్తామన్నారు. డిగ్రీ కళాశాలలో వృత్తి నైపుణ్య కోర్సులు కూడా అధికంగా ఉన్నాయని, వాటి ద్వారా విద్యార్థులు ఆర్థికంగా ఎదిగేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.